రూపంలో జనరంజకంగా ప్రదర్శించవచ్చు అని ప్రప్రథమంగా నిరూపించిన నర్తకి - శ్రీమతి కనక దుర్గ. అందుకే ఆమె నాట్యం చూసిన విశ్వనాథ సత్యనారాయణగారు "చిరంజీవి కనకదుర్గ చేసిన నాట్యం అంతా ఛందోబద్ధమైన, రసవత్తరమైన కవిత్వం లాంటిది''—అని మెచ్చుకున్నారు.

బాల్యం నుంచే నాట్యకళ పట్ల ఎంతో అభిరుచి కనబరచిన కనకదుర్గ అతి త్వరలోనే అందులో అభినివేశం సంపాయించారు. తంజావూరు బాల సుబ్రహ్మణ్యం పిళ్లై వద్ద శాస్త్రీయ పద్ధతిలో భరత నాట్యం, సూరబ్ ఖాణ్ గౌర్ వద్ద కథక్ నృత్యం అభ్యసించారు. రంగ ప్రవేశం చేసే నాటికే తారా చౌదరి, ఉదయశంకర్, గోపీనాథ తంగమణి, కృష్ణ అయ్యర్‌లాంటి నాట్య కోవిదుల అభినయరీతులను ఆకళింపు చేసుకుని దేశం నలుమూలలా నృత్య ప్రదర్శనలు జరిపి - నెహ్రూ, రాజేంద్రప్రసాద్, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ వంటి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు.

నృత్య నాటికలకు సరికొత్త రీతులలో నృత్యం కూర్చడంలో కనకదుర్గ చూపుతున్న నేర్పు అసాధారణమైనది. భారతీయ శాస్త్రీయ నృత్యం ఒక ప్రత్యేక సంప్రదాయానికి చెందినది. అలాంటి నృత్యాన్ని మధ్య ప్రాచ్య ఆహార్యంతో కూడిన పాత్రలకు 'అతిథిశాల' అన్న నృత్య నాటికలో సమకూర్చి ప్రముఖుల మన్ననలందుకున్నారు. సాంఘిక ఇతివృత్తం గల 'మూలస్తంభాలు' అనే నృత్య నాటికలో శాస్త్రీయ పద్ధతిలో నృత్య రీతులు చూపించారు.

క్షేత్రయ్య పదాలను, త్యాగరాజ కృతులను, రామదాసు కీర్తనలను ప్రత్యేకమైన శైలిలో అభినయించే కనకదుర్గ — శ్రీ శ్రీ 'అంతేలే పేదల గుండెలు' 'జగన్నాథ రథ చక్రాల్' లాంటి కవితలను కూడా తన నృత్య ప్రదర్శనలలో దృశ్య కావ్యాలుగా అద్భుతంగా అభినయించడం—ఆమె సృజనాత్మక శక్తికి చక్కని ఉదాహరణ!

శ్రీమతి కనకదుర్గ విజయవాడ ప్రభుత్వ సంగీత కళాశాలలో ఉపన్యాసకురాలుగా నాట్య కళలో అనేకమంది యువతీ యువకులకు శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర సంగీత నాటక అకాడెమీ సభ్యురాలైన ఈమెను మద్రాసు సంస్కృత విద్యా పీఠం గౌరవించింది. సంగీత కళానిధి ముసిరి నుంచి 'భరతనాట్య భూషణ' అన్న బిరుదును కూడా ప్రొఫెసర్ కనకదుర్గ అందుకున్నారు. ❋

# చిట్టి కథ

## పొరపాటు

"అమ్మాయ్ గీతా!" పార్వతమ్మగారి పొలికేక లాంటి పిలుపుకి 'పుస్తక ప్రపంచం'లోంచి తప్పని సరిగా 'ఇహ ప్రపంచం'లో పడవల్సి వచ్చింది గీతకి. అలవాటు ప్రకారం నవలలో చదువుతున్న పేజీని మూల మడతపెట్టబోయి ఆగిపోయింది - భర్త మందలింపు గుర్తుకొచ్చి.

ఆమె భర్త—పుస్తకాలను పసిపిల్లల కంటే అపురూపంగా చూసుకుంటాడు. తనకు బాగా నచ్చిన పుస్తకాలను తప్పకుండా కొనడం, వాటిని బీరువాలో అందంగా అమర్చి, ప్రతి యేడాది వాటిని 'రివిజన్' (తిరిగి చదువుకోవటం) చేయటం అతనికున్న ఒకానొక హాబీ.

పుస్తకాలను నీట్‌గా వుంచడానికి అతనెన్నో జాగ్రత్తలు తీసుకుంటాడు. ఆ జాగ్రత్తల్లో — 'ఏదైనా పుస్తకం చదువుతూ మధ్యలో ఆగవల్సి వస్తే పేజీ నంబరు గుర్తుంచుకోవాలిగాని పేజీ కార్నర్‌ని మడత పెట్టగూడదు' అనేది ఒకటి.

కానీ ఆ విషయం మర్చిపోయి పేజీ మూల మడత పెట్టినందుకు ఎన్నోసార్లు భర్తచేత ముక్క చీవాట్లు తింది గీత.

ఆ విషయం గుర్తు రావడంచేత గీత పేజీ నంబరు చూసింది. 'పేజీ నంబర్ 25' అనుకుంటూ, పుస్తకాన్ని భద్రంగా టేబుల్ మీద పెట్టి హాల్లోకి నడిచింది.

పార్వతమ్మగార్ని చాప వేసి కూర్చోమని, తనూ కూర్చుంది. ఆవిడ 'ఇరుగమ్మ, పొరుగమ్మ' గొడవలను తన కంచుగంట లాంటి నోటితో గంటసేపు అనర్గళంగా ప్రసారం చేసింది. ఆవిడ చెప్పే కబుర్లు వింటూ మధ్య మధ్య పేజీ నంబరు నెమరు వేసుకోసాగింది గీత.



గంట తర్వాత ప్రసార సమాప్తి గావించి లేచి వెళ్ళబోతూ, "చూడు తల్లీ, వచ్చిన పని మర్చిపోయి వెళ్ళిపోతున్నాను. మతిమాలినదాన్ని! నిన్ననే 'పరలోకం' పత్రిక నుంచి పారితోషికం అందింది. అప్పుడే వచ్చి నీ బాకీ యిచ్చేదామనుకున్నానుగానీ మర్చిపోయాను. అన్నట్టు నీకివ్వాల్సిందెంత?'' అంది ఆవిడ.

పార్వతమ్మగారు పత్రికలకు తరచుగా వంటలు—పిండివంటలు శీర్షికలకి వంటలు, కొన్ని పత్రికలకు 'పురాణకాలపు పతివ్రతలు - వారు భర్తలకు చేసిన సేవలు', 'బట్టలు శుభ్రంగా వుతకడమెలా?'లాంటి వ్యాసాలు రాసి పంపిస్తుంది. అవి 'అరుదుగా' అచ్చవుతుంటాయి. తన కొచ్చిన కాంప్లిమెంటరీలలో తన పేరును, తను రాసినదాన్ని వాడకట్టులో వాళ్ళందరికీ చూపించడం ఆవిడకి పరమానందం కల్గించే విషయం. వంటలూ, వ్యాసాలూ రాసే తను కూడా ఓ రచయితే అనే గర్వం కూడా లేకపోలేదు ఆవిడకి. ఆ విషయాన్ని తరచుగా అందరివద్దా ప్రస్తావించడానికి ప్రయత్నిస్తుంది.

ఆవిడ ప్రశ్నకు బదులుగా గీత, "ఇరవై అయిదు'' అంది చటుక్కున.

"ఏమో తల్లీ! నేనందరి దగ్గరా అప్పులు చేస్తానేగాని, ఎవరి దగ్గరెంత తీసుకుందీ గుర్తుండే చావదు. అంత మతిమరుపనుకో! బాకీ తీర్చేటప్పుడు వాళ్లనే అడుగుతాను 'ఎంతిచ్చారని'. వాళ్ళెంత చెబితే అంత యిచ్చెయ్యడమే! ఎక్కువైనా, తక్కువైనా'' అంటూ బొడ్లోంచి తీసిన పాతిక రూపాయలు గీత చేతిలోపెట్టి చకచకా వెళ్ళిపోయిందావిడ.

ఆవిడ గేటు దాటుతుండగా గుర్తొచ్చింది గీతకి ఆవిడ తనకివ్వవల్సింది నలభై రూపాయలని పొరపాట్న తను పేజీ నంబరు చెప్పిందని!'

రాకెట్‌లా దూసుకుపోతున్న పార్వతమ్మగార్ని వెనక్కు పిలిచి ఆ విషయమెలా చెప్పాలో [illegible] యక, తెల్లబోయి అలా చూస్తూండిపోయింది గీత.

— జ్ఞాన[illegible]



Edited & Published by B. Viswanatha Reddi for CHANDAMAMA CHILDREN'S TRUST FUND (Prop. of Chandamama Publications) & Printed by B. V. REDDI at Prasad Process Private Ltd., Madras-600 026.